
ప్రజాశక్తి

శుక్రవారం 12 జులై 2024



కలెక్టర్ పేరిట ఆన్‌లైన్ మోసాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేరిట నకిలీ కాల్స్ వస్తున్నాయని జిల్లా అధికార యంత్రాంగం తెలిపింది. కలెక్టర్ నగదు సహాయం ఆశిస్తున్నట్లు కొంతమంది సోషల్ మీడియాలో పోస్టింగులు చేస్తున్నారని, వీటి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. +977 970-2640751 నంబర్‌తో కాల్ చేసి కొంత మొత్తాన్ని పంపించాలని కోరుతున్నట్లు వెల్లడించింది. ఇటువంటి నంబర్‌తో వచ్చిన కాల్స్‌కు ఎవరూ సమాధానం ఇవ్వవద్దని కోరింది. ఇటువంటి ఆన్లైన్ మోసాలపై కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

ఉత్తరాంధ్ర రుణం తీర్చుకుంటాం

- ఎకనామిక్ హబ్‌గా భోగాపురం
- ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి
- భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పరిశీలించిన సిఎం చంద్రబాబు



ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, భోగాపురం

'ఈరోజు నేను ఇక్కడకు ప్రధానంగా వచ్చింది మా ఎన్‌డిఎ కూటమికి ఉత్తరాంధ్ర బ్రహ్మరథం పట్టారు. ఓట్ల వర్షం కురిపించారు. రాష్ట్రమంతా సునామీ, ఆ సునామీలో నెంబర్ వన్ ఉత్తరాంధ్ర. నేను కూడా సందేశం ఇవ్వాలనే ఇక్కడకు వచ్చాను. ఎప్పుడూ కూడా ఓట్లు వేసిన వారినిగానీ, ప్రాంతాలనుగానీ మర్చిపోవడం సబబు కాదు. అందరికీ న్యాయం చేస్తాం, కానీ ఉత్తరాంధ్రకు అదనంగా చేయాల్సి ఉంది. ఆ నమ్మకం కూడా మామీద పెట్టుకున్నారు'. అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 'నేను ఈ ప్రాంతవాసులందరికీ హామీ ఇస్తున్నాను. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసి చూపిస్తాను' అని చెప్పారు. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం పరిశీలించారు. ప్రభుత్వ అధికారులు, ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ (జిఎంఆర్) అధికారులతో కలిసి తొలుత సమీక్ష చేశారు. అనంతరం టెర్మినల్ నిర్మాణాలు జరుగుతున్న చోట విలేకర్ల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ 2026 జూన్ నాటికి పూర్తిచేస్తామని చెప్తోందని, తాను ఇంకా ముందుగానే అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం తరపున పూర్తిగా సహకరిస్తామనారు. తాను ఎప్పటికప్పుడు పోలవరం ప్రాజెక్టును సందర్శించి రెగ్యులర్‌గా సమీక్షిస్తున్నట్టే, ఎయిర్‌పోర్టు పనులు పరుగులెత్తించే బాధ్యత కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించానని అన్నారు. ప్రస్తుతం విశాఖపట్నం ఎయిర్‌పోర్టు 2.8 మిలియన్ ప్రయాణికులకు సేవలు అందిస్తోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం నాటికే 4.5 మిలియన్ ప్రయాణికులకు సేవలు అందించేలా రూపకల్పన జరుగుతోందని అన్నారు. క్రమంగా దీని కెపాసిటీ 45 మిలియన్ ప్రయాణికులకు సేవలు అందించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి కల్పన ఏమేరకు అందించగలమనేదానిపై నిర్మాణ సంస్థ నుంచి నివేదిక కోరామని తెలిపారు. ఈ ఎయిర్ పోర్టు పూర్తయితే రాయగఢ్, కోరాపూట్, మల్కన్‌గిరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాలకు అనుసంధానం ఏర్పడుతుందన్నారు. అధికారుల సమీక్షలో కొన్ని చిన్న చిన్న సమస్యలను కూడా తమ దృష్టికి వచ్చాయని, ప్రధానంగా నేషనల్ హైవే నుంచి 6 కిలోమీటర్ల మేర రోడ్డు కనెక్టివిటీ, పాత నేషనల్ హైవేలో 12 చోట్ల కనెక్టివిటీలు, జంక్షన్లను అభివృద్ధి చేయడం వంటివి ఉన్నాయని అన్నారు. వీటన్నింటినీ ఒక్కొటిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఏ ఎయిర్‌పోర్టుకైనా కనెక్టివిటీ చాలా ముఖ్యమని, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా ఎక్కడ నుంచి బయలుదేరినా నేరుగా విమానాశ్రయానికి చేరుకునే అవకాశం ఉందని, భోగాపురం ఎయిర్‌పోర్టుకు అదే విధమైన రోడ్డు కనెక్టవిటీ కల్పిస్తామని అన్నారు. దీంతో ఈ ప్రాంతం ఎకనామిక్ హబ్‌గా తయారవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దీనికి ముందు ఎయిర్‌పోర్టులో జిఎంఆర్ సంస్థ ఏర్పాటు చేసిన ఎక్సిపీరియన్స్ సెంటర్‌ను సందర్శించారు. జిఎంఆర్ సంస్థ బిజినెస్ చైర్మన్ జిబిఎస్ రాజు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఐపి రావు పవర్ పాయింట్ ద్వారా ఎయిర్‌పోర్టుకు సంబంధించిన అంశాలను వివరించారు. ఎయిర్‌పోర్టుకు సంబంధించి 97 శాతం ఎర్త్ వర్క్స్, 32 శాతం రన్‌వే పనులు, టాక్సీ వే పనులు 16 శాతం వరకు పూర్తయినట్లు వారు పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి సంబంధించి విశాఖ నుండి భోగాపురం మధ్య 12 క్రిటికల్ జంక్షన్లు ఉన్నాయని, వాటిపై ప్లై ఓవర్స్, బ్రిడ్జిలు వేయవలసిన అవసరం ఉందని వివరించారు. భోగాపురం నుండి శ్రీకాకుళం వరకు ఉన్న స్టేట్ హై వేస్‌ను 2 లైన్ల నుండి 4 లైన్లకు మార్చాలని, విశాఖపట్నం బీచ్ నుండి భోగాపురం వరకు 6 లేన్ల రహదారి వేయాలని సిఎంకు తెలిపారు. తారకరామా తీర్థ సాగర్ పూర్తి చేయడం ద్వారా ఎయిర్‌పోర్టుకు నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు.

132 కెవి సబ్ స్టేషన్ కోసం 5.47 ఎకరాలను కేటాయించారని, గత రెండు నెలలుగా బిల్లులు చెల్లించలేదని, నిధులు కేటాయిస్తే ఆ పనులు కూడా పూర్తి చేస్తామని కోరారు. సిఎం స్పందిస్తూ అన్ని రకాల అనుమతులను, నిధులను, కనెక్టివిటీ వ్యవహారాలను అత్యంత ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. పనులు వేగవంతం చేసి లక్ష్యానికి 6నెలల ముందే ఆపరేషన్‌లోకి వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర పౌర విమాన యాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు లోకం మాధవి, బేబినాయన, తోయక జగదీశ్వరి, బోనెల విజయ్‌చంద్ర, కోండ్రుమురళీ, కిమిడి కళా వెంకటరావు, కోళ్ల లలితకుమారి, జిఎంఆర్ బిసిఎం బివిఎస్ రావు, మాజీ పౌర విమాన శాఖా మంత్రి అశోక్ గజపతి రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ , ఎస్‌పి ఎం.దీపిక, ఆర్‌డిఒ సూర్యకళ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎయిర్‌పోర్టు స్థలానికి చేరుకున్న ముఖ్యమంత్రికి కలెక్టర్ సహా ప్రజాప్రతినిధులంతా పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

ధరల నియంత్రణకు చర్యలు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి



సాలూరులో సబ్సిడీపై బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. గురువారం పట్టణంలోని చిన బజార్ సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సబ్సిడీపై బియ్యం, కందిపప్పు దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన బియ్యం, కందిపప్పు లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ ధరల కన్నా తక్కువ ధరలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ధరల నియంత్రణకు ఏవిధమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రేషన్ దుకాణాల్లో బియ్యం తప్ప మిగిలిన సరుకులేవీ పంపిణీ చేయలేదని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన బియ్యాన్నే గత ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిందని ఎద్దేవాచేశారు. కిలో కందిపప్పు రూ.160కు, సోనామసూరి బియ్యం (స్టీమ్డ్) కిలో రూ.49, ముడిబియ్యం కిలో రూ.48కు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తక్కువ ధరలకు పంపిణీ చేస్తున్న నాణ్యమైన బియ్యం, కందిపప్పులను వినియోగించుకోవాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ హేమలత, టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, సీనియర్ నాయకులు కేతిరెడ్డి చంద్రశేఖర్, కొనిసి చిన్ని, కౌన్సిలర్లు వైదేహి కృష్ణారావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి సబ్సిడీపై కందిపప్పు, సన్నబియ్యం విక్రయాలు చేపట్టిందని డిఎస్‌ఒ శివప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం పలుచోట్ల ప్రత్యేక తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం అమ్మకాల కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో కిలో కందిపప్పు 181 రూపాయలు ఉందన్నారు. కందిపప్పు ప్రత్యేక స్టాల్‌లో160 రూపాయలకు అందిస్తున్నామని చెప్పారు. రైతు బజార్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయాలు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : నిత్యావసర వస్తువుల ధరలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డిఒ వి.వి.రమణ అన్నారు. సివిల్ సప్లై ఆధ్వర్యంలో పాలకొండలో రెండు చోట్ల కందిపప్పు అమ్మకపు ప్రత్యేక కౌంటర్లను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వరహాలు, సి.ఎస్.డి.టి. మల్లేశ్వరరావు, విఆర్‌ఒ బి.శ్రీనివాస్‌రావు, తదితరులు ఉన్నారు.

శివ్వాం దళితుల సమస్య పరిష్కరించకుంటే

ఆందోళన ఉధృతం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామానికి చెందిన దళితుల భూ సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వక్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమస్యపై గురువారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు యమ్మల మన్మథరావు అధ్యక్షతన ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దళితుల భూసమస్య అనేక సంవత్సరాలుగా పరిష్కరించకుండా రెవెన్యూ యంత్రాంగం సాగదీస్తోందన్నారు. 1970లో శివ్వాం దళితులకు 22.80 ఎకరాల భూమిని ప్రభుత్వం మంజూరు చేసి, డి పట్టాలను కూడా ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ భూమిని అప్పటినుండి దళితులు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ భూమిపై పెత్తందారుల కన్నుపడి తరచూ దళితులపై దాడులకు పాల్పడుతూ, దురాక్రమణలకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితులు సాగు చేస్తున్న భూమిపై తప్పుడు సర్వే నెంబర్లతో కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చి, రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం ద్వారా దళితులను ఆ భూమి నుంచి అన్యాయంగా తొలగించారని ఆవేదన వ్యక్తంచేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బి, అడంగల్, ఎస్‌ఎఫ్‌ఎలో దళితుల పేర్లు ఉన్నాయని, హక్కులన్నీ ఉన్నా వారిపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. అయినా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం.. పెత్తందార్లపై చర్యలు తీసుకోకుండా, దళితులపై తప్పుడు కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఇప్పటికైనా దళితుల భూ సమస్య పరిష్కారం చేయాలని, లేకుంటే ఈ నెల 15 నుండి 29 వరకు పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేస్తామని, 29న మహా ధర్నా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంఘం, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, డిహెచ్‌పి నాయకులు జి.జనార్ధన్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, ఐద్వా నాయకురాలు రెడ్డి శ్రీదేవి, సిఐటియు నాయకులు గొర్రెల వెంకటరమణ, బంకురు సూరిబాబు, పట్టణ నాయకులు పి.సన్యాసిరావు, పలు సంఘాల నాయకులు సూరయ్య, టి.జీవ మోహన్ రావు, సిపిఎం నాయకులు బొత్స వెంకటరమణ, ఎల్లయ్య, లక్షణ, ఫకీర్ అమ్మ, నారాయణ స్వామి, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణకు అవగాహన అవసరం



డాక్టర్ శివకుమార్‌కు అవార్డు అందజేస్తున్న ఉన్నతాధికారులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జనాభా నియంత్రణకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఆ దిశగా వైద్య, ఆరోగ్య అధికారులు కృషి చేయాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ అన్నారు. గురువారం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి ఐటిడిఎ కార్యాలయం వరకు చైతన్య ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపరీత జనాభా పెరుగుదల వల్ల సహజ వనరులు అంతరించి అనర్థాలకు దారితీస్తుందన్నారు. సుస్థిర అభివృద్ధి, కుటుంబ నియంత్రణ, పేదరికంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మాత, శిశు శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డల మధ్య అంతరం ఉండేటట్లు అవగాహన కల్పించే విధంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, ఉద్యోగాల నైపుణ్యం కోసం జనాభా నియంత్రణ అత్యవసరమన్నారు. దీని ప్రభావం ఆర్థికాభివృద్ధిపై స్పష్టంగా పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అనంతరం కుటుంబ నియంత్రణకు కృషి చేసిన వైద్య సిబ్బందికి ప్రథమ, ద్వితీయ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ అవార్డులు గ్రహీతలు.. డాక్టర్ నాగ శివ జ్యోతి (ఏరియా ఆసుపత్రి, పాలకొండ), డాక్టర్ వి.మీనాక్షి (ఏరియా ఆసుపత్రి, సాలూరు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఉత్తమ వేసెక్టమి సర్జన్‌గా డాక్టర్ డి.శివ కుమార్, డాక్టర్ వై.విజయ్ మోహన్ మొదటి రెండు స్థానాలకు ఎంపికయ్యారు. ఉత్తమ కౌన్సిలర్లుగా ఎ.తులసి, జి.రీనా, ఉత్తమ ఎఎన్‌ఎంలుగా కె.పార్వతి (పిహెచ్‌సి, తోనాం), పుష్పలత (పిహెచ్‌సి, రేగిడి), వేసక్టమి చేయించుకున్న జంటకు, కుటుంబ నియంత్రణ సాధనాలు అమర్చిన వారికి, కుటుంబ నియంత్రణ ఇంజెక్షన్ వేసుకున్నవారికి రూ.5వేల చొప్పున పారితోషికాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ వాగ్దేవి, ఇన్చార్జి డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.శివకుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం.నారాయణ, జిల్లా మలేరియా అధికారి జగన్మోహన్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి వినోద్, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, ఎన్‌జిఒ సంఘ అధ్యక్షులు జి.ఎస్.కిషోర్, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

డబ్బుల వసూలు చేసిన ఎంఇఒపై యుటిఎఫ్ ఫిర్యాదు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

సమాచార హక్కు చట్టం పేరిట ఉపాధ్యాయులను మభ్యపెట్టి వారి నుంచి నగదు వసూలు చేసిన గరుగుబిల్లి, జియ్యమ్మవలస ఎంఇఒ-1 బాధ్యతలను నిర్వహిస్తున్న ఎన్.నాగభూషణరావుపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.మురళి, ఎస్.మురళీమోహనరావు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందిస్తూ ఇది ఒక ముఠాగా పని చేస్తుందని, డబ్బులు వసూలు చేసిన ఎంఇఒను పిలిపించి, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.మురళి, కార్యదర్శులు పి.వెంకట్ నాయుడు, బి.జగన్నాథం పాల్గొన్నారు.

రంగంవలస కొండల్లో

ఏనుగుల సంచారం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో రంగంవలస కొండల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. బొడ్డమానుగూడ, గుండం తదితర ప్రాంతాల్లో ఏనుగులు సంచరించడంతో గిరిజనులు భయం ఆందోళన చెందుతున్నారు. గజరాజుల ఘీంకారాలతో గిరిజనులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఎప్పుడు వ్యవసాయ పొలాలపైన పడతాయని ఆందోళన చెందుతున్నారు.

పశుగ్రాస వారోత్సవాలు ప్రారంభం



పశుగ్రాసంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మన్మథరావు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పాడిరైతులకు పశుగ్రాస వినియోగంపై అవగాహన కల్పించి తద్వారా పాల ఉత్పత్తులు మెరుగుపరిచేందుకు జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి వారం రోజులపాటు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక అధికారి మన్మథరావు తెలిపారు. గురువారం పార్వతీపురం మండలం లచ్చిరాజుపేటలో ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెరుగైన పాల ఉత్పత్తుల కోసం మేలైన పశుగ్రాసాన్ని తమ పొలాల్లోనే పెంచుకుని, పశువులకు వినియోగించడం ద్వారా ఖర్చు తగ్గుతుందని తెలిపారు. పాల ఉత్పత్తులు పెరిగి రాబడి అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. పశుసంవర్ధక శాఖ తరపున రైతులు తమ పొలాలలోని పశుగ్రాసాన్ని పండించుకునేందుకు 75 శాతం సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు.



ఇకెవైసి కోసం బారులు తీరిన ప్రజలు

మళ్లీ అదే వరుస

ఇకెవైసి కోసం క్యూ కడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ఇకెవైసి చేయించుకోవడానికి సమయం ఉందని అధికారుల ఒకవైపు ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు ప్రజలు ఇకెవైసి కోసం గుమ్మలక్ష్మీపురం జిసిసి కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వచ్చి బారులు తీరుతున్నారు. ఇకెవైసికి ఎక్కువ సమయం లేదని తప్పుడు ప్రచారం జరగడంతో ప్రజలు తరలివస్తున్నారు. దీంతో రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇదే వరుస కనిపిస్తోంది. పనులు మానుకొని గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.



నిరసన తెలుపుతున్న గిరిజనులు, ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం నాయకులు

సబ్‌డిపో ఏర్పాటుచేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని ఆడారుపాడులో సబ్ డిపో ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గెమ్మెల బాబూరావు, సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆడురుపాడులో గిరిజనులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆడారుపాడు, బుచంపాడు, కాగులగడ్డ, కాట్రగుడ్డి, లోవ పర్తాపురం, బంగారు గుడ్డి గ్రామాలకు వాహనం ద్వారా వచ్చి రేషన్ సరుకులు అందిస్తున్నారని తెలిపారు. కానీ గిరిజనుల వద్ద ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు వసూలు చేస్తున్నారని, దీన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఇక్కడున్న గిరిజనులు మడవలస, పద్మాపురం వెళ్లి సరుకులు తీసుకురావడం చాలా కష్టమన్నారు. ఆడారుపాడులో సబ్ డిపో ఏర్పాటు చేయాలన్నారు. కుంతాం గిరిజన గ్రామంలో డిపో ఏర్పాటు చేసి గిరిజనులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

16 నుంచి పారిశుధ్య వారోత్సవాలు

సాలూరు : వర్షాకాల సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. గురువారం తన క్యాంప్ కార్యాలయంలో పారిశుధ్య వారోత్సవాల వాల్‌పోస్టర్లను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు నిర్వహించనున్న పారిశుధ్య వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి, నీరు సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. లార్వా అభివృద్ధి చెందకుండా క్లోరినేషన్ పనులు చేయించాలన్నారు. దోమలు నివారణకు డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ బలివాడ సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి బి.వి.ఎస్.ప్రసాద్, డిఆర్‌పి గణపతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పత్రికా కార్యాలయంపై దాడి అమానుషం

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

విశాఖపట్నంలోని డెక్కన్ క్రానికల్ పత్రికా కార్యాలయంపై టిడిపి నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడడం అమానుషమని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ఖండించారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా దాడులు చేయడం సరికాదని చెప్పారు. ఈ రకమైన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గతంలో వైసిపి ప్రభుత్వం హయాంలో పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించినట్లు గొంతు చించుకున్న సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఈ దాడులను ఏమంటారని ప్రశ్నించారు. దక్షిణ భారత దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన డెక్కన్ క్రానికల్ పత్రికా కార్యాలయంపై దాడి మీడియా స్వేచ్ఛపై దాడిగా పరిగణించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాజన్నదొర డిమాండ్ చేశారు.

నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం

ప్రజాశక్తి-కొమరాడ

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల జంఝావతి రబ్బర్ డ్యామ్ వద్ద అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. గురువారం రబ్బర్‌డ్యామ్ వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యామ్ సందర్శనకు అనేక మంది వస్తున్నా కనీసం ప్రమాద హెచ్చరికలు పూర్తిస్థాయిలో పెట్టకపోవడం దారుణమన్నారు. అందువల్లే అనేక మంది ప్రమాదాల బారిన పడి, ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి జంఝావతి రబ్బర్ డ్యామ్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆశీల వేలం ఖరారు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో రోజువారి మార్కెట్, రోడ్డు మార్జిన్ ఆశీలు, పశువుల కమేళాలో ఆశీల వసూళ్లకు వేలం ఖరారైంది. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి దిబ్బ రూబెన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యాన నిర్వహించిన వేలంలో బుడిత శ్రీనివాసరావు రూ.9.32 లక్షలకు వేలం పాడారు. కార్యక్రమంలో డిపిఒ కనకారావు, ఆర్ఐలు పి.నారాయణరావు, జి.వినయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్లు పుష్పలత శైలజ పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని పెదపెంకి బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై ఉన్న గోతులను సామాజిక సేవకులు ఈర్ల సంజీవ నాయుడు సొంత డబ్బులతో గురువారం పూడ్చివేయించారు. ప్రధాన రహదారిపై ఎన్నో ఏళ్లగా మరమ్మతులకు గురైన రోడ్డును ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేయడంతో తాను ముందుకు వచ్చానని ఆయన తెలిపారు. దీనికి గ్రామస్తులు సహకరించారని తెలిపారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-భామిని

భామినిలో మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు ఆధ్వర్యంలో పిహెచ్‌సి వైద్య సిబ్బంది, విద్యార్థులు డెంగీపై అవగాహన ర్యాలీ చేపట్టారు. డెంగీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అప్పారావు వివరించారు. ప్రభుత్వం అందించిన దోమ తెరలు వాడాలని, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఒ భాస్కరరావు, ఎఎన్ఎం సుజాత, హెల్త్ అసిస్టెంటు ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 7న విశాఖపట్నంలో జరిగిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్ఐ షణ్ముణరావు అభినందించారు. కురుపాం నియోజకవర్గం నుండి 50 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది విద్యార్థులు బెల్ట్‌లకు అర్హత సాధించారు. కార్యక్రమంలో కోచ్ నరేష్ పాల్గొన్నారు

చిట్టిపూడివలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో చిట్టిపూడి వలస గ్రామంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ వివిధ రకాలైన రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పవిత్ర, ఎఎన్ఎం పైడితల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని గంగన్నదొరవలస, మామిడిపల్లి, తోణాం, జీగిరాం గ్రామాల్లో విద్యుత్తు లైన్ల మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు డిఇ వివి కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలతో పాటు సాలూరు పట్టణ పంప్ హౌస్‌కి కూడా విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని లోవముఠా ప్రాంతమైన రేగిడి, గొరడ, దుడ్డుఖల్లు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని చెట్ల కొమ్మల తొలగిస్తామని చెప్పారు. అందులో భాగంగా విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పారిశుధ్యంపై అవగాహన సదస్సులు

ప్రజాశక్తి-సీతానగరం

ఈనెల 16 నుంచి ఆగస్టు రెండో తేది వరకు పారిశుధ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఈశ్వర రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఈనెల 16 నుంచి పారిశుధ్యం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో అన్ని పంచాయతీలలోనూ ఈ కార్యక్రమాలు అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించి, ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. తద్వారా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. సమావేశంలో కేకే కుమార్ వర్మ, ఎపిఒ బాను, ఎపిఎం శ్రీరాములు, ఎంఇఒ సూరిదేముడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ర్యాలీని ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి



సాలూరులో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

జనాభా నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని గిరిజన సంక్షేమ, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ర్యాలీని గురువారం తన క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. ర్యాలీనుద్దేశించి ఆమె మాట్లాడుతూ ఒకరు లేదా ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకోవాలనే నిబంధన అమల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కేతిరెడ్డి చంద్రశేఖర్, కౌన్సిలర్లు వైదేహి కృష్ణారావు, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారులు ప్రదీప్‌కుమార్, మానస ఆసుపత్రుల నుండి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద విద్యార్థులతో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జనార్ధన్ రావు, శాంతకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేటలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ గ్రామంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీని పిహెచ్‌సి వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పైల అభిలాష్, సిహెచ్ఒ పద్మ, ఆరోగ్య కార్యకర్తలు సింహాచలం, ఎర్రాయమ్మ, ఐ.శ్రీను, ఎన్.రత్న ప్రసాద్, ఎస్‌వి ప్రకాశ్, బి.లక్ష్మణ, పి.రాధాకృష్ణ, ఎఎన్ఎంలు ప్రభావతి, అర్చన, ధనలక్ష్మి పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక బస్టాండ్ వద్ద ఎంపిడిఒ అధికారి రమేష్ నాయుడు, ఎంఇఒ ఎస్.సింహాచలం, మండల వైద్య అధికారి కిరణ్మయి ఆధ్వర్యాన ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు.

హాస్టళ్లను దత్తత తీసుకోవాలి

బ్యాంకర్లను కోరిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సిఎస్ఆర్ కార్యక్రమం కింద కనీస సౌకర్యాలు కల్పించేందుకు హాస్టళ్లను దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో బ్యాంకులు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాల్సి ఉందన్నారు. కనీస ఖర్చుతో కనీస సౌకర్యాలు హాస్టళ్లలో కల్పించడం వల్ల పిల్లలకు మెరుగైన వసతులు అందుతాయని ఆయన తెలిపారు. గ్రామీణ యువతకు కంప్యూటర్లు, ఎలక్ట్రీషియన్, ఎసి మెకానిక్, ప్లంబింగ్ వంటి పలు విభాగాల్లో శిక్షణ ఇచ్చేందుకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. అందుకోసం భూమిని మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులకు రుణాలివ్వడంలో బ్యాంకర్లు పూర్తి సహకారం అందించాలని కోరారు. రైతులు తమ జీవనాధారమైన సాగు ద్వారా స్థిర ఆదాయాన్ని పొందేందుకు బ్యాంకర్లు సౌకర్యాలు కల్పించాలన్నారు. కౌలురైతులకు కూడా రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. పిఎంజెడివైలో ఎన్‌రోల్‌మెంట్‌ను జిల్లాలో వంద శాతం సాధించాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో 104 బ్యాంకు శాఖలు, 1593 బిజినెస్ కరస్పాండెంట్లు ఉన్నాయని ఎల్‌డిఎం జెఎల్ఎన్ మూర్తి తెలిపారు. రూ.3637.81 కోట్లతో వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను ఆమోదించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌బిఐ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ గిరిధర్ బెహరా, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి గయాజుద్దీన్, బిసి కార్పొరేషన్ ఇడి ఆర్.గడ్డెమ్మ, సంబంధిత బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వైసిపి నాయకులు

భామిని : కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను వైసిపి నాయకులు గురువారం మర్యాపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. మండలాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఆయన వెంట వైసిపి నాయకులు పోతల చంద్రభూషణ, సంజీవ్ రావు ఉన్నారు.

మల్లి ఆశ్రమ పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో మల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ సందర్శించారు. ఆరో తరగతి విద్యార్థుల తెలుగు అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు చక్కగా బోధించి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు వెనుకబడిన విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చి ముందుకు తీసుకురావాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.వి.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించండి

విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని డిడి రుక్మాందయ్య ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం సీతంపేటలో బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, వార్డెన్లు, జిపిఎస్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పూర్తి స్థాయి వసతులు కల్పించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై విద్యాబోధనపై దృష్టిపెట్టాలని. బడి బయట పిల్లలు ఉండకుండా చూడాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ పి.నారాయుడు, ఎంఇఒ ఆనందరావు, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

గుమ్మలక్ష్మీపురం : నేను సైతం కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్‌రావు గురువారం స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో పిల్లలు లేకపోవడం వల్ల పాఠశాల మూత పడిపోయే స్థాయికి చేరుకుందని తెలిపారు. పాఠశాల మూత పడకుండా చూడాలని ఎంఇఒ చంద్రశేఖర్‌ను విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కోరినట్లు తెలిపారు. పాఠశాలకు సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల తల్లిదండ్రులకు ఆ పాఠశాలపై ఆసక్తి తగ్గిందన్నారు. అక్కడ ఉన్న సమస్యలను గుర్తించి ఉపాధ్యాయుడు ప్రసాద్ రూ. 35వేలు, గ్రామం నుండి, తన సొంత నిధులతో కలిపి రూ.70 వేలతో పాఠశాలకు గేటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. విద్యార్థుల సంఖ్య మరింత పెంచాలని కోరారు.

ట్రిపుల్ ఐటికి పలువురు ఎంపిక

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని జియ్యమ్మవలస ప్రభుత్వోన్నత పాఠశాల నుంచి బర్లి పవిత్ర, బి.జె.పురం హైస్కూల్ నుంచి వసంతల చాందిని, కర్రి నిషిత ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు.

కురుపాం : కురుపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు, మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్టు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు, తలిదండ్రుల కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

భామిని : భామిని ఆదర్శ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు.

వీరఘట్టం : ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మండలంలోని 19 విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఎంఇఒ ఆనందరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న భామిని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శివ

కాండంపై పూతతో

రసం పీల్చే పురుగుల నివారణ

ప్రజాశక్తి-పాచిపెంట

పత్తి పంట 40 రోజుల లోపు వయసు ఉన్నప్పుడు కాండంపై మోనోక్రోటోఫాస్ 1:4, లేదా ఇమ్మిడా క్లోప్రిడ్ 1:20 నిష్పత్తిలో నీటిలో కలిపి కాండంపై పూత పూస్తే రసం పీల్చు పురుగులను నివారించవచ్చని వ్యవసాయ శాఖ ఎడి ఎం.మధుసూదన్ రావు తెలిపారు. మండలంలోని మాతుమూరు గ్రామంలోని పత్తి క్షేత్రంలో గురువారం కాండంపై పూత పూసే విధానాన్ని రైతులకు వివరించారు. ప్రస్తుతం అన్నిచోట్ల బిటి పత్తి రకాలు సాగవుతుండటంతో పురుగుల బెడద పూర్తిగా తగ్గిందన్నారు. కానీ రసం పీల్చు పురుగుల బెడద ఎక్కువగా ఉందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని ఇస్తూ పర్యావరణానికి, భూమికి ఎలాంటి రసాయన అవశేషాలు పడకుండా రసం పీల్చు పురుగుల నివారించడానికి కాండంపై మందు పూత విధానం చాలా ప్రయోజనకరమని తెలిపారు. ఈ విధానంలో కాండం ముదురుగా ఉంటే పనిచేయదన్నారు. 40 రోజుల వయసులోపు మాత్రమే ఈ విధానాన్ని రైతులు అవలంబించాలని కోరారు. అనంతరం పత్తి పంటపై వచ్చే తామర పురుగు, పచ్చదోమ, పేను బంకలను చూపించారు. పంటపై ఎండలో మెరుస్తున్న వెండి చారలు కనిపిస్తే తామర పురుగుగా గుర్తించాలన్నారు. మొక్కపై నల్ల చీమలు కనిపిస్తే పేను బంక, పచ్చ దోమ ఆశించినట్లుగా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, విఎఎ బంటు దినేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



గోతిలోకి దిగబడిన లారీ

గోతిలో ఇరుక్కున్న ఇసుక లారీ

గంటల తరబడి నిలిచిన ట్రాఫిక్

ప్రజాశక్తి-భామిని

మండలంలో గురండి వద్ద ప్రధాన రహదారిలో ఏర్పడిన గోతిలో గురువారం మధ్యాహ్నం ఒడిశా నుండి వస్తున్న ఇసుక లారీ ఇరుక్కుంది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గురువారం రాత్రి వరకు చిన్న వాహనాలను పంపించి, భారీ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిలిపేశారు. దీంతో కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్తూరు నుండి బత్తిలి వరకు ప్రధాన రహదారి గోతులతో అస్తవ్యస్తంగా ఉంది. ప్రమాదాలు జరుగుతున్నా, వాహన రాకపోకలు ఇబ్బంది కలుగుతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదని వాహనదారులు ఆరోపించారు.



హైవే పనులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల పరిశీలన

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని కేసలి పంచాయతీ రాళ్లపాడు గిరిజన గ్రామం వద్ద గురువారం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను ఆర్‌డిఒ కె.హేమలత పరిశీలించారు ముఖ్యంగా గ్రామానికి చెందిన మూడు ఇళ్లు రహదారి నిర్మాణంలో పూర్తిగా నష్టపోయాయి. వాటికి నష్టపరిహారం ప్రభుత్వం అందించలేదు. దీంతో నష్టపరిహారం అందించాలంటూ రోడ్డు నిర్మాణ పనులను గ్రామస్తులు పలుమార్లు అడ్డుకొన్నారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆర్‌డిఒ కె.హేమలత క్షేత్రస్థాయిలో ఇళ్ల నష్టాన్ని పరిశీలించారు. ఇళ్ల నష్టం విలువ కట్టి నివేదిక ఇవ్వాలని ఆర్‌అండ్‌బి సి, తహాశీల్దార్ పి.బాలను ఆదేశించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆమె వెంట ఆర్ఐ రమణ, విఆర్ఒ ప్రశాంత్, సర్వేయరు ఉన్నారు.



డ్వామా పీడీ రామచంద్రరావుతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

'ఉపాధి'లో అవినీతిపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-కొమరాడ

ఉపాధి హామీలో సిబ్బంది అవినీతి చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఎంపిపి శెట్టి శ్యామల హెచ్చరించారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ కె.రామచంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2023-24 ఏడాదికి సంబంధించి మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు, పింఛన్లపై కొద్దిరోజులుగా గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ బృందాలు ప్రజా వేదికలో వివరాలు వెల్లడించాయి. మస్తర్లలో ఉపాధి కూలీల సంతకాలు సక్రమంగా లేవని తనిఖీ బృందాలు గుర్తించాయి. కొన్నిచోట్ల పనులు చేసినట్లు లెక్కలు చూపినా, అక్కడ పని మాత్రం కనిపించడం లేదని వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు, ఎపిఒ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జలకళ అమల్లో ఉందా? లేదా?

వైఎస్ఆర్ జలకళ పథకం అమల్లో ఉందా? లేదా? అని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి.. డ్వామా పీడీ కె.రామచంద్రరావును ప్రశ్నించారు. సామాజిక తనిఖీ ప్రజావేదికకు హాజరైన పీడీని సాంబమూర్తి కలిసి, సమస్యను వివరించారు. కొమరాడ మండలంలో జలకళ పథకం కోసం 295 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. జలకళ పథకంలో గత ఐదేళ్లలో జియ్యమ్మవలస మండలం పరసపాడులో ఒక బోరు తీశారని, నియోజకవర్గంలో మరెక్కడా బోర్లు తీయలేదని తెలిపారు. ఇలాంటి సందర్భంలో జలకళ పథకం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. పీడీ స్పందిస్తూ జలకళ కింద మరి బోర్లు మంజూరు కావన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం గతంలో మాదిరిగా జలసిరి పథకం ప్రవేశపెడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి-సీతంపేట

జ్వరాలు ఉన్నచోట వైద్య శిబిరాలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తిరుపతిరావు ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. సీతంపేట, బామిని మండలాల్లోని గిరిజన గ్రామాల్లో మలేరియా, టైపాయిడ్ జ్వరాలు విజృంభించి, గిరిజనులు అల్లాడి పోతున్నా వైద్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. నెల రోజులు గడుస్తున్నా ప్రాజెక్ట్ అధికారి లేరని, డిప్యూటీ వైద్యాధికారి లేరని, డెప్యుటేషన్ అధికారులు పూర్తి దృష్టిసారించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీతంపేట ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు ఉంటున్నారని తెలిపారు. అత్యవసర వైద్యం అందక చాలా కేసులు ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నారని తెలిపారు. ఇదే అదునుగా పాలకొండలోని కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు దోపిడీకి పాల్పడుతున్నాయని చెప్పారు.

కౌలు రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం, వంగర గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు కౌలురైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రసాదరావు మాట్లాడుతూ గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులకు ప్రభుత్వం నుండి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, బ్యాంకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. పండించే పంటలకు నష్టం వాటిల్లితే కౌలురైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్, సర్పంచ్ తులసమ్మ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

బస్సు ఢీకొని విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

ఆర్‌టిసి బస్సు ఢీకొని చినమేరంగి గ్రామానికి చెందిన రెండో తరగతి విద్యార్థి ఒమ్మిడాపు లావణ్యకు తీవ్ర గాయాలయ్యాయి. పాఠశాల విడిచిపెట్టిన అనంతరం ఇంటికి వస్తున్న సమయంలో బస్సు ఆమెను ఢీకొనడంతో రెండు కాళ్ల పాదాలు నలిగిపోయాయి. వెంటనే చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా డ్యూటీలో ఉన్న వైద్యాధికారి ఆర్ ఆర్ కృష్ణ చైతన్య వెంటనే చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు చినమేరంగి ఎస్ఐ చిన్నమనాయుడు కేసు నమోదు చేశారు.